క్లుప్తంగా

పాఠశాలలో వైద్యశిబిరం



ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం దాచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాష్ట్రీయ బాల స్వస్తియ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆహారపు అలవాట్లపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద, ఉపాధ్యాయులు బాలాగౌడ్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



మర్రిగడ్డలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న నాయకులు

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డలో తాటికొండ ఉమకు రూ.39,500, మల్యాల రాజేశంకు రూ20వేల సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దూది శ్రీనివాస్‌రెడ్డి, రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇందూరి మధు బుధవారం అందజేశారు. యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ బాకీకార్డుల డ్రామా’



ఎల్లారెడ్డిపేట: మండలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాకీ కార్డుల పేరుతో గ్రామాల్లో డ్రామాకు తెరలేపారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ ఆఫీస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో ఎన్నో వాగ్దానాలు చేసి మరిచిపోయిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరబేగం, వైస్‌చైర్మన్ గుండాటి రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, చిన్ని బాబు పాల్గొన్నారు.

ఆలయ విస్తరణకు మద్దతుగా హైకోర్టులో కేవియట్ పిటిషన్

వేములవాడ: రాజన్న ఆలయ అభివృద్ధి పనులు చట్టబద్ధంగా, భక్తుల సౌకర్యార్థం జరుగుతున్నాయని తెలుపుతూ, ఎవరూ అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించినా ముందుగా తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించాలన్న అభ్యర్థనతో ఒజ్జల వంశీకృష్ణ హైకోర్టులో బుధవారం కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆలయ పునరుద్ధరణ సమయంలో ఉత్సవమూర్తులను భీమేశ్వరస్వామి ఆలయానికి తాత్కాలికంగా తరలించడం ఆగమశాస్త్రపరంగా సముచితమేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయం భక్తుల విశ్వాసాన్ని కాపాడే దిశగా ఉందన్నారు. కొందరు భక్తులను తప్పుదోవ పట్టిస్తూ అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పనులు సాఫీగా కొనసాగడానికి తాము కేవియట్ పిటిషన్ దాఖలు చేశామని వంశీకృష్ణ, హైకోర్టు న్యాయవాది రాంప్రసాద్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పోతుగల్ రహదారిలో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన విభూతి సాయిబాబా(25) ఇంట్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే పక్కా సమాచారంతో తనిఖీ చేయగా 22 సంచుల్లో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయన్నారు. సాయిబాబాపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

రాతి కట్టడాలే ఉండాలి



వేములవాడ: చారిత్రక కట్టడాలకు నిలయంగా ఉన్న రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా కాంక్రీటు సిమెంటు కట్టడాలు వాడకుండా భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా రాతి కట్టడాలతో నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, గోలి మహేశ్‌లు బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిమెంటు, కాంక్రీట్‌తో కూడిన కట్టడాలతో ఆలయ ప్రాశస్త్యం, చరిత్ర దెబ్బ తినడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు.

రైతులు పాడిపరిశ్రమపై దృష్టి పెట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గాలికుంటు నివారణ టీకాల పంపిణీ



పల్లిమక్తలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట: రైతులు పాడిపరిశ్రమపై దృష్టి పెడితే అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. కోనరావుపేట మండలం పల్లిమక్తలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీని బుధవారం కలెక్టర్ ఎం.హరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై 200 యూనిట్ల గేదెలను రైతులకు ఇటీవల పంపిణీ చేశామన్నారు. ఆసక్తి, అర్హత గల రైతులకు పశువులు పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యమానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు పాడిపరిశ్రమ కింద ఉపాధి కల్పించేందుకు ఇటీవల ఆ శాఖ మంత్రిని కలిశామన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు సాగునీరు అందించి పంటలను కాపాడామని, ఈ ఏడాది రిజర్వాయర్ లో రెండు టీఎంసీల నీటిని నిల్వ ఉంచామని, వచ్చే ఏడాది మూడు టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతామని వివరించారు. మల్కపేటకు రూ.12 కోట్ల బిల్లులు చెల్లించామని, రుద్రంగి కలికోట సూరమ్మ చెరువుకు రూ.75కోట్లు మంజూరు చేయగా, పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. నాగారానికి రోడ్డు వేయించామని, పల్లిమక్తలో రూ.1.50కోట్లతో రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఎం.హరిత

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరిత కోరారు. అర్హులైన రైతులకు పశువులు, కోళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం టీకాలు పంపిణీ చేస్తోందని, పశువుల పెంపకందారులు తమ గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు జీవాలను తీసుకెళ్లి టీకాలు వేయించాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, తహసీల్దార్ వరలక్ష్మి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, గొట్టె రుక్మిణి, బొర్ర రవి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



ముస్తాబాద్‌లో..

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఇల్లంతకుంట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కందికట్కూర్ ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలం ముస్తాబాద్, పోతుగల్, బందనకల్, ఆవునూర్, నామాపూర్ హైస్కూళ్లలో కలాం జయంతి నిర్వహించారు. ఎంఈవోలు శ్రీనివాస్‌గౌడ్, నిమ్మ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, శంకర్, రాజు, రాజ్‌కుమార్, రాధాకిషన్‌రావు పాల్గొన్నారు.

17న నిరసనలో పాల్గొనాలి

- ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్



మాట్లాడుతున్న ఖానాపురం లక్ష్మణ్

వీర్నపల్లి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 17న చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు వడ్లూరి రాజం, పొత్తూరి రాజం, కన్నం దేవరాజు, మల్లారపు రాజయ్య, బూర్ల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలపై కాంగ్రెస్‌ను నిలదీయండి

ఎల్లారెడ్డిపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామాల్లో పర్యటించే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి కోరారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట, పదిర, వెంకటాపూర్ గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలను అమలు చేయలేక పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బందారపు బాల్‌రెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, రామ భీమేశ్వర్, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, పులి రమేష్, కొండ రమేష్‌గౌడ్, బాలయ్య, కొండ ఆంజనేయులుగౌడ్, పాశం దేవారెడ్డి, మామిండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్ : ఆర్జీఎస్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ చైర్మన్ దేవానంద నాయుడు, జాతీయ కార్యదర్శి భూక్య శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పోచవేని ఎల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, బాలరాజు, దావీద్, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్, జింక శరత్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రాజిరెడ్డి

సిరిసిల్లటౌన్: అండర్-14 ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్స్ విద్యార్థినిలు టి.సహస్విత(9వ తరగతి), బి.ఆశ్రిత రెడ్డి(8వ తరగతి) విద్యార్థినిలు ఎంపికయ్యారు. ఈనెలలో హైదరాబాద్‌లోని పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికవగా బుధవారం స్కూల్ కరస్పాండెంట్ పల్లె రాజిరెడ్డి అభినందించారు. ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ నారా శ్రీనివాస్‌రెడ్డి, తడకల సురేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్, బాబు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని దుస్తుల వ్యాపార సంఘం సభ్యులు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేరాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా నార్ల అనిల్ కుమార్, కోశాధికారిగా కీర్తి విజయ్, సలహాదారులుగా బొల్లి మార్కండేయ, కొమిర గోపి, సభ్యులుగా నటరాజ్, దశరథం, విజయ భాస్కర్, రామచంద్రం, హరీశ్, రాము, శ్రీనివాస్, సందీప్‌ను ఎన్నుకున్నారు.

దొంగలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో పలు గ్రామాల్లో గుర్తు తెలియని దొంగలు సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాహుల్‌రెడ్డి సూచించారు. రాచర్లగొల్లపల్లిలో సోమవారం రాత్రి పాన్ షాపులో దొంగతనం చేసి స్కూటీపై పారిపోతున్న ఇద్దరు యువకుల సీసీపుటేజీలను బుధవారం పోలీసులు విడుదల చేశారు. గుర్తు తెలియని యువకులు గ్రామాల్లో బైక్‌లపై సంచరిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి శుభకార్యాలకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగలు సంచరిస్తున్నట్టు తెలిస్తే ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్, 8712656373, ఎస్సై రాహుల్‌రెడ్డి, 8712656374లలో తెలియజేయాలని కోరారు.

మధ్యవర్తి ఇంటికి తాళం

వీర్నపల్లి: అప్పు విషయంలో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఇంటికి తాళం వేసిన ఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు. గర్జనపల్లికి చెందిన ఓ వ్యక్తి వడ్డీ వ్యాపారి వద్ద రూ.10 మిత్తికి రూ.2.50లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దానికి అదే గ్రామానికి చెందిన వ్యక్తిని మధ్యవర్తిగా ఉంచాడు. వడ్డీ డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారి మధ్యవర్తి ఇంటికి మంగళవారం తాళం వేశాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై ఎస్సై వేముల లక్ష్మణ్‌ను వివరణ కోరగా ఇంటికి తాళం వేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూరులో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 342 పశువులకు టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి పూర్ణచంద్రిక తెలిపారు. గాలిపెల్లి వెటర్నరీ వైద్యాధికారి ఇందిర, సహాయకులు లచ్చయ్య పాల్గొన్నారు.

ఏఐసీసీ అబ్జర్వర్‌ను కలిసిన ప్రవీణ్ జే టోని



తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని బుధవారం ఏఐసీసీ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్‌ను బుధవారం కలిశారు. సిరిసిల్ల పట్టణంలో టోనిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డిలు ఏఐసీసీ అబ్జర్వర్‌కు పరిచయం చేశారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సూర ఎల్లయ్యరత్నవ్వ కూతురు సంతోష వివాహానికి పలువురు నాయకులు అండగా నిలిచారు. బుధవారం జరిగిన వివాహానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్ రూ.10వేలు, మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి బీరువా, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్ డ్రెస్సింగ్ టేబుల్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణ, శేఖర్ పాల్గొన్నారు.

ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

వేములవాడఅర్బన్: న్యూఅర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేతులు అపరిశుభ్రంగా ఉండటం వల్ల శ్వాసకోస వ్యాధులతో ఏటా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది పిల్లలు చనిపోతున్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

సౌండ్ సిస్టమ్ వితరణ

సిరిసిల్లకల్చరల్: పద్మనగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలకు పట్టణానికి చెందిన వ్యాపారి దుబాల మొండయ్య సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం దుబాల మొండయ్య, విజయ దంపతులు సుమారు రూ.40వేల విలువైన సౌండ్ బాక్స్‌లు, ఆంప్లిఫయర్‌ను అందజేశారు. మొండయ్య దంపతులను మండల విద్యాధికారి దూస రఘుపతి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ చకినాల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన

వీర్నపల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి జయ, ఏఈవో ఫజిల్, డీహెచ్ఎస్‌వో లత, ఎంపీడీవో బీరయ్య, తహసీల్దార్ ముస్తాక్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన వినయ్, గంట రాజు బైక్‌పై ఆవునూర్ వెళ్తున్నారు. వెంకటాపూర్ శివారులో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రత్యేక తెలంగాణ తరహాలో బీసీల ఉద్యమం

ముస్తాబాద్: తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ సాధన తరహాలో బీసీల రిజర్వేషన్ల అమలు ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం వచ్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఇడుగురాళ్ల సురేశ్ బుధవారం ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం కూడా బీసీలకు ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. ముస్తాబాద్‌లో బీసీ జేఏసీ ఏర్పాటుకు బీసీ నాయకులు, మేధావులు, యువకులను ఆహ్వానిస్తున్నామని, అందరూ హాజరుకావాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అబ్బగోని అంజాగౌడ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, తిరుపతిరెడ్డి, రవీందర్‌గౌడ్, లచ్చిరెడ్డి, కొలిపాక నర్సయ్యలు అంజాగౌడ్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

వీధి కుక్కలకు వింత రోగం

వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని వీధి కుక్కలు వింత రోగంతో బాధపడుతున్నాయి. చర్మంపై తోలు ఊడిపోయి బక్కచిక్కి నీరసించి చనిపోతున్నాయి. కుక్కలకు ఏదో వైరస్ సోకిందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చూడడానికి భయంకరంగా ఉంటున్నాయని, ఇవి సంచరించిన ప్రాంతాల్లోనివారు చర్మవ్యాధులకు గురవుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో సిరిసిల్లలో పిచ్చి మొక్కలతో రోడ్డు మూసుకుపోతుంది. పోచమ్మ ఆలయం ముందు.. విద్యానగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ సందిలో ప్రధాన రోడ్డు పిచ్చిమొక్కలతో మూసుకుపోతుంది. మున్సిపల్ అధికారులు పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, తేళ్ల నివాసం ఉండే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రోడ్డుపైకి ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలి. – కోడం శ్రీనివాస్, విద్యానగర్, సిరిసిల్ల.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, సెల్ నంబరు: 98499 05879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



సీపీఆర్ చేసి చూపిస్తున్న సూపరింటెండెంట్ లావణ్య

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు, అధ్యాపకులకు మెడికవర్ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య బుధవారం శిక్షణ అందించారు. లావణ్య మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటుకు గురైతే అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. జ్వరానికి సొంత వైద్యం చేయకుండా రక్తపరీక్షలు చేయించుకుని వైద్యుడితో చికిత్స పొందాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, రంజిత్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సామూహిక సీమంతాలు చేస్తున్న అధికారులు

కోనరావుపేట: పోషకాహారంతోనే గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసంలో మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌లాల్, హెల్త్ సూపర్‌వైజర్లు మేర్సీ, సువర్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గంగాలక్ష్మి, కనకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



హాజరైన అధికారులు

ఇల్లంతకుంట: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని సీడీపీవో ఉమారాణి అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం మండల అంగన్‌వాడీ టీచర్లతో పోషణ మాసం నిర్వహించారు. గర్భిణిలకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేపట్టారు. పండ్లు, పాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, ఎక్కువగా వాడాలని సీడీపీవో కోరారు.కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, పెద్ద లింగాపురం, ఇల్లంతకుంట సూపర్‌వైజర్లు సూర్యకళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

గంభీరావుపేట : ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, కౌన్సిల్ సభ్యులతో కలిసి గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ జర్నల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, కౌన్సిల్ సభ్యులు ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, ఎడిటర్లు డాక్టర్ ఈ.రాంభాస్కర్ రాజు, డాక్టర్ టి.యుగంధర్ పాల్గొన్నారు.

కంటతడిని రాజకీయం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: మాగంటి గోపినాథ్‌ను గుర్తుచేసుకుంటూ కన్నీరు పెట్టుకున్న మాగంటి సునీతపై కాంగ్రెస్ మంత్రులు రాజకీయం చేయడం శోచనీయమని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ పేర్కొన్నారు. స్థానిక తెలంగాణ భవన్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ మంత్రులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాగంటి సునీతకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను తట్టుకోలేక మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు సంస్కృతికి నిదర్శనమన్నారు. మట్టె శ్రీనివాస్, ఎస్.కె.అప్రోచ్, కోడం వెంకటేశం, సిరిమల్లె హరీశ్, సంపత్, నరేశ్, రాము పాల్గొన్నారు.